

ఆరోగ్య గంట



వైద్య పరిభాషలో 'గోల్డెన్ అవర్' అనే పదం వాడతారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తినప్పుడు గంటలోపు వైద్యుల వద్దకు చేరుకుంటే కోలుకునే అవకాశాలు వందశాతం ఉంటాయి. వైద్యంలో 'గోల్డెన్ అవర్' ఎంత ముఖ్యమో.. ఆరోగ్యం కోసం నిత్యం గంట సమయం కేటాయించడం అంత ముఖ్యం అంటున్నారు. ఆరోగ్య నిపుణులు. దీనిని ఈ కాలం అతివలు అందిపుచ్చుకున్నారు. ఫిట్‌నెస్ అంటే సిక్స్‌ప్యాక్ అనుకుంటారు కొందరు. అందమైన శరీర ఆకృతి అని మరికొందరి భావన. ఇవేవీ కాదు.. ఫిట్‌నెస్ అంటే ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం, సంపూర్ణ ఆరోగ్యానికి తొలిమెట్టు అంటున్నారు అతివలు. ఇన్నాళ్లు ఫిట్‌నెస్, జిమ్‌లు ఇతర వ్యాయామశాలలకు పురుషులే వెళ్లేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరూ జిమ్‌లకు వెళుతున్నారు. ఆరోగ్యం కోసం చెమటోడ్చుతున్నారు.

- (కడప-ఆంధ్రజ్యోతి)

6

- కసరత్తుల వైపు అతివల చూపు
- అందం.. ఆరోగ్యం.. ఆత్మస్థైర్యం కోసం..
- ఫిట్‌నెస్, జిమ్‌లపై ఆసక్తి
- కడపలో పెరుగుతున్న నయా ట్రెండ్



రోజుకో గంట మీకోసం కేటాయించండి..

నేను గైనకాలజిస్ట్‌గా పనిచేస్తున్నాను. మహిళలు కుటుంబం కోసం రోజంతా కేటాయిస్తుంటారు. మీ కోసం మిమ్మల్ని నమ్ముకున్న వారికోసం రోజులో ఒక గంట ఫిట్‌నెస్‌కోసం కేటాయించండి. టీనేజీ నుంచే కొందరిలో నెలసరి సమస్యలు వస్తున్నాయి. థైరాయిడ్ వస్తోంది. టాబ్లెట్లు వేస్తే తాత్కాలిక ఉపశమనం లభిస్తుంది. రోజూ ఒక గంట వర్కౌట్లు చేస్తే టాబ్లెట్ అవసరంలేదు. మీ జీవితకాలం కూడా పెరుగుతుంది. కార్డియో వర్కౌట్లు, శరీరం, కండరాల గట్టిదనం కోసం వర్కవుట్లు చేయాలి. వర్కవుట్ల వల్ల జాయింట్ పెయిన్స్ రావు. మైండ్ ఫ్రెష్‌గా ఉంటుంది. ఎముకలు బలపడతాయి. బీపీ, షుగర్ వంటి వ్యాధులు దరిచేరవు. టీనేజీ నుంచి అందరూ ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాల్సిందే.

- డాక్టర్ అపురూప, గైనకాలజిస్ట్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కడప



Sunday Special



నేటి నుంచి హైదరాబాదుకు డైలీ ఫ్లైట్

- ప్రారంభం చేయనున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నుంచి హైదరాబాదుకు ఇక ప్రతిరోజూ ఫ్లైట్ నడవనుంది. ఈ మేరకు ఆదివారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభం చేయనున్నారు. వైసీపీ ప్రభుత్వంలో హైదరాబాదుకు ఫ్లైట్ రద్దు చేశారు. ఈ విషయం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందిస్తూ హైదరాబాదుకు రోజూ కడప నుంచి ఫ్లైట్‌ను వేశారు. ఇక ఆదివారం నుంచి ప్రతిరోజూ ఉదయం 11.30గంటలకు వచ్చి 12.40కు బయల్దేరుతుంది. అలాగే ఆది, సోమ, బుధ శుక్రవారాల్లో మధ్యాహ్నం కడప నుంచి చెన్నైకి 2.30 గంటలకు వచ్చి 3.30కు బయల్దేరుతుంది. కడప నుంచి విజయవాడకు మంగళ, గురు, శనివారాల్లో 2.24గంటలకు వచ్చి 3.35కు బయల్దేరుతుంది.

పార్టీ కోసం శ్రమించిన వారికే కీలక పదవులు

- వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం శ్రమించిన వారికి కీలక పదవులు వస్తాయని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి అన్నారు. శనివారం కడపలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో రామచంద్రారెడ్డి అధ్యక్షతన కడప, అన్నమయ్య జిల్లాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ బలోపేతంపై దృష్టి సారించామన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తలతో చర్చించి పార్టీ పోస్టుల్లో నియామకాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ పరిస్థితి దారుణంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏపీపీఆర్‌సీ సమావేశం అనగానే కరెంటు బిల్లులు పెంపు అని పత్రికల్లో రాసేవారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో 6వేల కోట్లు కరెంటు చార్జీలు పెంచడానికి రంగం సిద్ధం చేశారన్నారు. కరెంటు చార్జీల పెంపు గత ప్రభుత్వంలో జగన్ తప్పుల వల్ల అని విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే సుధ, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

రూ.లక్ష చెల్లించి జీవితకాల సభ్యత్వాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్న ఎమ్మెల్యే ఆర్.మాధవి.. చిత్రంలో ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు



5 లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యం

- ఓటు హక్కుఉన్న ప్రతి పౌరుడు అర్హుడే
- రూ.5లక్షల ప్రమాద బీమాతో కూడిన టీడీపీ సభ్యత్వం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ పార్టీకి లేనటువంటి ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమాతో కూడిన సభ్యత్వం టీడీపీ కల్పించిందని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. జిల్లాలో రూ.5 లక్షలు సభ్యత్వం లక్ష్యమని అన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవడానికి అర్హులన్నారు. శనివారం కడప నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి సంబంధించి గ్రామస్థాయి నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తామన్నారు. తటస్థులను సైతం ఆకర్షించే విధంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు లక్షల సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 65వేల నుంచి 70వేల వరకు సభ్యత్వం చేయాలని సూచించారు. 100 రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే రెండు సంవత్సరాల పాటు అది ఉంటుందన్నారు. వీరికి రూ.5 లక్షల ప్రమాద బీమా ఉందన్నారు. అలాగే సభ్యత్వం ఉన్న వ్యక్తి చనిపోతే రూ.10వేలు అంత్యక్రియలకు ఇస్తారన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం 75 రోజుల పాటు జరుగుతుందని అనంతరం గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. క్రమశిక్షణతో పద్ధతి ప్రకారం ఈ నమోదు జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్.మాధవి లక్ష రూపాయలు చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు.

విద్యార్థుల కోసం 'ఓపెన్ హౌస్'

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థుల సందర్శనకోసం ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేరదర్యాప్తు విధానం తదితర విషయాలను విద్యార్థులకు తెలియజెప్పడానికి ఈ ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్‌హౌస్‌లో భాగంగా బాంబు డిస్పోజబుల్ టీం, ఫింగర్‌ప్రింట్, పోలీసు కంట్రోల్‌రూం, కమ్యూనికేషన్స్ ఆయుధాల విడిభాగాలు, ఆర్ఎఫ్ఎస్ఎల్ తదితర విషయాల గురించి ఎస్పీ వివరించారు. బాడీవార్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరా, వీహెచ్ఎఫ్‌సెట్, రోబోడ్రెస్, లాక్డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం ప్రదర్శనలో ఉంచారు. నేర పరిశోధనలో పాల్గొనే డాగ్ స్క్వాడ్ బృందంలో ఇటీవల నూతనంగా చేరిన జాగిలాలు డయానా, రూబీలతో పాటు లూనీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, శివరాముడు, టైటస్, నగరంలోని సీఐలు, ఆర్ఎస్ఐలు, నగరంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



ఓపెన్‌హౌస్‌లో ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

వైవీయూ సీఈగా క్రిష్ణారావు బాధ్యతలు



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైవీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సీఈగా క్రిష్ణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. చాంబరులో వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. బోధన, బోధనేతర సిబ్బంది వైవీయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, కరస్పాండెంట్లు నూతన సీఈని కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం క్రిష్ణారావు మాట్లాడుతూ అకడమిక్ రీసెర్చ్, అడ్మినిస్ట్రేషన్లలో గత అనుభవాన్ని వినియోగించుకుని పరీక్షల విభాగాన్ని సమర్థవంతంగా నడుపుతామని అన్నారు.



ఎర్రగుంట్ల మార్కెట్‌యార్డులో ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

వ్యవసాయ జూదంలో మరోసారి అన్నదాత ఓడిపోయాడు. కాకపోతే ఈసారి ఉల్లిరైతు వంతు. ఎకరాకు రూ.లక్ష ఖర్చుచేసి ఉల్లిసాగు చేసిన రైతులకు.. ఎకరాకు రూ.70వేలు నష్టం రావడంతో కంటతడి పెడుతున్నారు. తమ బతుకు జూదంలా మారిపోయిందని కనీస గిట్టుబాటు ధర లేదని, ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఓ పక్క తుఫాన్, మరో పక్క దళారుల చేతుల్లో చిక్కి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. పంట దిగుబడి వచ్చే సమయానికి తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో కుళ్లురోగం తగిలి గడ్డలు కుళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసున్నారు. దీనికి తోడు మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా తగ్గిపోవడంతో తమకు కన్నీరు మాత్రమే మిగిలిందని ఉల్లిరైతులు వాపోతున్నారు.

ఉల్లి రైతు కన్నీరు

- ఒక్కసారిగా కుదేలైన ధర
- పంట చేతికందే సమయంలో కుళ్లుతెగులు
- తుఫాన్ దెబ్బకు పంట నాశనం
- ఎకరాకు రూ.70వేలు నష్టపోయామంటున్న రైతులు
- టన్ను కేవలం రూ.10-15 వేలే
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

పులివెందుల/ఎర్రగుంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతు కన్నీరు కార్చే పరిస్థితులు దాపురించాయి. టన్ను ఉల్లి రూ.20వేల నుంచి రూ.35వేల వరకు పలికింది. కానీ ఇపుడు రూ.10వేల నుంచి రూ.15వేల లోపు మాత్రమే పలుకుతోంది. దీంతో ఉల్లి రైతు బావురుమంటున్నారు. ఈ ఏడాది ఉల్లి విస్తీర్ణం ఎక్కువగా ఉంది. పులివెందుల నియోజకవర్గంతో పాటు కమలాపురం, జమ్మలమడుగు, మైదుకూరు నియోజకవర్గాల్లో ఉల్లి పంట సాగుచేశారు. జిల్లాలో దాదాపు 5వేల ఎకరాల్లో ఉల్లిపంట సాగైంది. అది కూడా రెడు దఫాలుగా సాగుచేశారు. ఈ పంట మే చివరి మాసంలో ఒక దఫా సాగుచేయగా.. మరికొందరు జూన్ మాసం చివరిలో వేశారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే ధర కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు. ఉల్లి పంట సాగు దగ్గర నుంచి పంట పండే సమయానికి దాదాపు రూ.లక్ష ఖర్చు అవుతుంది. ఉల్లి టన్ను రూ.20వేల నుంచి రూ.35వేలు పలికితే రైతుకు లాభాలు వస్తాయి. అంతకంటే తక్కువ ధర అయితే మాత్రం నష్టాలు చవిచూడాల్సిందే. మే నెలలో సాగైన పంట సెప్టెంబరుకు చేతికొచ్చింది. అపుడు ధర రూ.25వేల నుంచి రూ.35వేలు పలికింది. జూన్‌లో సాగై పంట ఇప్పుడు చేతికొచ్చింది. ఈ సమయంలో వర్షంతో తెగుళ్ల బారిన పడి దిగుబడులు తగ్గడం.. దీనికి తోడు ధర పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

తుఫాన్‌తో రెక్కల కష్టం బూడిదపాలు

తుఫాన్ కారణంగా నేలలో తేమశాతం పెరగడంతో ఉల్లిగడ్డలు కుళ్లిపోతున్నాయి. దీంతో వర్షం తగ్గగానే రైతులు పంటను పీకేసి మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమయ్యారు. కానీ నాలుగైదు రోజులుగా ధర రోజురోజుకు పతనమవుతోంది. సోమవారం, మంగళవారం పొలాల వద్ద...

తరువాయి 6లో..

పంటను ఎలా అమ్ముకోవాలి..



నాకున్న రెండు ఎకరాల పొలంలో ఉల్లి పంట సాగుచేశాను. ఎకరాకు దాదాపు రూ.80వేలు పెట్టుబడి ఖర్చు అయింది. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. తుఫాన్ కారణంగా కుళ్లు తెగులు కూడా సోకింది. వెంటనే అమ్ముకోకపోతే పంట పాడవుతుంది. కానీ వ్యాపారులు ఎవరు రావడం లేదు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. పంటకు పెట్టిన పెట్టుబడి, కష్టం అంతా మట్టిపాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

- వరికూటి రాజగోపాల్‌రెడ్డి, మర్రిపల్లె, వీరపునాయునిపల్లె మండలం



కొమ్మద్దిలో పాడైన ఉల్లి పంటను చూపుతున్న రైతు

ఎకరాకు 30క్వింటాళ్లే దిగుబడి..



ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కాని తుఫాన్ వల్ల పంట బాగా దెబ్బతిని కేవలం 30క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఎరువులు బాగా వేశాం. కానీ దిగుబడి మాత్రం రాలేదు. దీనికి తోడు ధర క్వింటా రూ.1200 నుంచి రూ.1800మాత్రమే పలుకుతోంది. రెండున్నర ఎకరాల్లో ఉల్లిసాగు చేశాను. ఈసారి ఎకరాకు రూ.80వేలకు పైబడి నష్టపోయాను.

- వి.శివకుమార్‌రెడ్డి, రైతు, సుంకేసుల





వైసీపీ నగర అధ్యక్షుడు ఎవరో..?

- ఎంపికపై తొలగని పీటముడి
- అధ్యక్షుడి కోసం పలువురు ఆసక్తి
- మాజీ డిప్యూటీ సీఎం కుటుంబ సభ్యులైతే మేలంటున్న కార్యకర్తలు

(కడప-ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జగన్ సొంత జిల్లాలో వైసీపీ ఘోర పరాభవం మూటకట్టుకుంది. రాష్ట్రంలో వైసీపీ చిత్తుగా ఓడిపోయింది. జిల్లాలోనూ గౌరవప్రద మైన స్థానాలు దక్కక పోవడంతో వైసీపీ కేడరు జీర్ణించుకోలేకపోతోంది. వచ్చే ఎన్నికల నాటికి పార్టీని సిద్ధం చేసేందుకు జగన్ జిల్లా అధ్యక్ష పదవిని ఆయన మేనమామ మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాధరెడ్డికి కట్టబెట్టారు. జిల్లాలో పార్టీబలోపేతానికి రవీంద్రనాధరెడ్డి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే ఇప్పుడు ఆయనకు కడప వైసీపీ నగర అధ్యక్ష పదవికి తగిన వ్యక్తిని ఎంపిక చేయడమే కత్తి మీద సాములాగా మారిందంటారు. కడప టీడీపీ ఎమ్మెల్యే ఆర్.మాధవిని ఎదుర్కొనేందుకు బలమైన అభ్యర్థికి అధ్యక్ష పదవి కట్టబెట్టాలని యోచిస్తున్నట్లు సమాచారం.

మల్లగుల్లాలు

జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాధరెడ్డి అధ్యక్షతన ఇటీవల వైసీపీ జిల్లా కార్యాలయంలో ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమానికి మేయరు సురేశ్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో పాటు పలువురు హాజరయ్యారు. ఆ సమయంలోనే కడప నగర అధ్యక్ష పదవిపై చర్చ జరిగినట్లు చెబుతారు. ఈ పదవి కోసం కార్పొరేటర్లు పాకా సురేశ్, కిరణ్, షఫితో పాటు డిప్యూటీమేయర్ బండి నిత్యానందరెడ్డి, మాసీమ బాబు, దాసరి శివ, పులి సునీల్‌కుమార్, ఆదిత్య ఆశిస్తూ వచ్చారు. అయితే ఆ సమావేశంలో మాసీమ బాబును ఎన్నుకోవాలనుకున్నారు. దీంతో మిగతా వారు నిరాశకు గురయ్యారని చెబుతారు.

కడప నగర అధ్యక్ష పదవి అంటే ఆషామాషీ కాదు. ఇక్కడ ఎమ్మెల్యే మాధవీని ఎదుర్కోవాలి. ఎదుర్కోవాలంటే చిన్న సన్న నేతల వల్ల కాదని వైసీపీ నేతలు నిర్ణయించినట్లు చెబుతారు. ఆర్థికం అంగబలం ఉన్న వ్యక్తి అయితేనే రాణిస్తారని అలా ఉంటేనే సాధ్యమని అంటున్నారు. పార్టీ పిలుపు మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేసేందుకు జనాలను తీసుకురావాలన్నా, ఇతరత్రా వాటికి తట్టుకోవాలన్నా అంగబలం, అర్థబలం ఉన్న వారు అయితే సాధ్యమని భావించి అధ్యక్ష పదవిని మాసీమబాబుకు కట్టబెట్టకుండా హోల్డ్‌లో పెట్టారని అంటున్నారు. మాజీ డిప్యూటీ సీఎం పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్నారు. గత ఐదేళ్ల డిప్యూటీ సీఎంగా పనిచేశారు. వీరు ఆర్థికంగా బలంగానే ఉన్నారు. కార్యకర్తలతో కనెక్ట్ ఉంది. వీరి కుటుంబం నుంచి ఒకరిని అధ్యక్ష స్థానంలో కూర్చోబెడితే సరిపోతుందని కార్యకర్తలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. అంజద్‌బాషా సోదరుడు అహ్మద్‌కు ఇచ్చినా సరిపోతుందంటున్నారు. ఇక మరో డిప్యూటీ మేయరు బండి నిత్యానందరెడ్డి కూడా సామాజికపరంగా మంచి అంగబలం ఉన్న వ్యక్తినే. ఈయనకు కులం అదనపు బలం. ఇతనైనా టీడీపీని ఎదుర్కొంటారని అంటున్నారు. అయితే ఇంకా బలమైన నేత కోసం వైసీపీ నేతలు ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి వైసీపీలో కడప నగర అధ్యక్ష పదవి ఆ పార్టీకి పెద్ద పీటముడిలా తయారయింది. చూద్దాం మరి ఎవరికి అధ్యక్ష పదవి కట్టబెడతారో.

మైలవరానికి 13వేల క్యూసెక్కులు విడుదల

- అవుకు నుంచి ఇన్‌ఫ్లో 14000 క్యూసెక్కులు

7



ప్రమాదంలో మృతి చెందిన గంగాధర్‌రెడ్డి

పాడి గేదె కోసం వెళ్తూ...

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి
- ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం తండ్రికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రిలో కుటుంబీకుల రోదన

7

ఆరోగ్య గంట

- కసరత్తుల వైపు అతివల చూపు
- అందం.. ఆరోగ్యం.. ఆత్మస్థైర్యం కోసం...
- ఫిట్‌నెస్, జిమ్‌లపై ఆసక్తి
- కడపలో పెరుగుతున్న నయా ట్రెండ్

(కడప-ఆంధ్రజ్యోతి): అందరి జీవితం ఇప్పుడు ఉరుకులు పరుగులుగా ఉంది. జీవనోపాధులతో పాటు జీవన వ్యయమూ బాగా పెరిగింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఇతరత్రా ఉద్యోగాలు చేయడం తప్పనిసరి కావడంతో అందరూ బిజీ అయిపోయారు. మహిళలు మరింత బిజీ అయిపోయారు. ఓ వైపు ఇంటి పని చేసుకుంటూ మరోవైపు ఉద్యోగమో వ్యాపారమో నిర్వహిస్తున్నారు. దీంతో చాలా మంది రకరకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దీనిని అధిగమించేందుకు ఇప్పుడు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మనిషి జీవన విధానం, తీసుకునే ఆహారంలో పెద్దమార్పే తీసుకొచ్చింది. ఒకప్పుడు సినీ నటులు, సెలబ్రెటీలుగా ముద్రపడిన వారు ఫిట్‌నెస్ జిమ్, యోగా చేస్తూ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసేవారు. ఫిట్‌నెస్ అంటే వాళ్లకే అనుకునేవాళ్లు. కానీ ట్రెండ్ మారింది. ఆరోగ్యమే మహాభాగ్యం అనే ఆలోచన మహిళల్లో మొదలైంది. రోజుకో గంట వ్యాయామం చేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటి దాకా ఫిట్‌నెస్ సెంటర్లు, జిమ్‌లలో రోప్ వర్కౌట్లు, కోర్ వర్కౌట్లు, కార్డియో వర్కౌట్లు, బరువులు ఎత్తడం, జంపింగ్‌జాక్స్ కేవలం పురుషులు మాత్రమే చేస్తుండేవారు. ఇపుడు లేడీస్ కూడా కసరత్తులు చేస్తున్నారు. అందంతో పాటు శరీరం దృఢంగా ఉంచుకునేందుకు పరుగులు తీస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం

మహిళలకు ప్రత్యేకంగా ఫిట్‌నెస్, జిమ్ సెంటర్లు లేవు. అయినప్పటికి వీరు ఫిట్‌నెస్ కోసం పాకులాడుతున్నారు. శారీరకంగా దృఢంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నట్టు. రోజూ గంటపాటు జిమ్ చేస్తే శరీరం స్ట్రాంగ్‌గా కావడమే కాదు.. మానసికంగా దృఢంగా ఉంటారు. ఆత్మస్థైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం ఉంటుంది. అనారోగ్యం దూరం అవుతుంది, బరువు తగ్గవచ్చు. సాధారణంగా పురుషులతో పోల్చుకుంటే మహిళల ఎముకలు బలహీనంగా ఉంటాయి. అయితే వ్యాయామం వల్ల ఎముకలు గట్టిపడతాయి. బరువు అదుపులో ఉంటటుంది. సాధారణ ప్రసవాలు జరిగేందుకు వీలుంటుంది. జీవితం కాలం కూడా పెరుగుతుంది. పీసీఓడీ సమస్యల నుంచి బయటపడవచ్చు.

కడపలో నయా ట్రెండ్

కడపలో అన్ని రకాల వ్యాయామ సెంటర్లు 30కి పైగా ఉన్నాయి. వీటిలో కొన్ని ఫిట్‌నెస్, యోగా, జిమ్ కేంద్రాలు ఉన్నాయి. మహిళలకు ఫిట్‌నెస్ కేంద్రాలు మెట్రోసిటీస్ అయిన చెన్నై, బెంగళూరు, వైజాగ్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో మాత్రమే ఉండేవి. ఇప్పుడు కడపలో ట్రెండ్ మారింది. మహిళల్లో మార్పు వచ్చింది. అటు వృత్తి రీత్యా, కుటుంబం రీత్యా రోజంతా కష్టపడుతున్నారు. మనం బాగుంటేనే మన వృత్తికి, మనం నమ్ముకున్న వారికి న్యాయం చేయగలుగుతాం అని భావిస్తున్నారు. అందుకే చాలా మంది వాకింగ్ చేస్తున్నారు. కొందరు ఇంట్లోనే వ్యాయామం చేస్తున్నారు. దీనితో పాటు అందంపై కూడా శ్రద్ధ పెరిగింది. జంక్‌ఫుడ్ కారణంగా ఓబెసిటీ పెరిగి ఇబ్బంది పడుతుంటారు. నాజుగ్గా ఉండాలని టీనేజీ నుంచి మధ్య వయస్కుల వారికీ ఉంటుంది. అందుకే ఆరోగ్య మంత్రాన్ని పాటిస్తుండడంతో నారీమణులతో ఫిట్‌నెస్ కేంద్రాలు కళకళలాడుతున్నాయి. పురుషులతో సమానంగా ట్రాక్ ప్యాంట్స్, గ్లౌజెస్, టీషర్ట్స్ ధరించి వర్కవుట్లు చేస్తున్నారు. డైట్ ఫాలో అవుతూ కొందరు తమ రూపాన్ని మార్చుకుంటుంటే, మరికొందరు శరీర ఆకృతిని మార్చుకునేందుకు శ్రద్ధ చూపుతున్నారు.

జిమ్‌ల బాట

ఉద్యోగస్తులు, గృహిణులు, విద్యార్థినిలు రోజుకో గంట వ్యాయామం చేయాలని నిర్ణయించుకుంటున్నారు. నాజూగ్గా ఉండేందుకు కొందరు పరితపిస్తుంటారు. బీపీ, షుగర్, ఆర్థరైటిస్ ఇతర అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉండాలని అందరూ కోరుకుంటూ ఉంటారు. ఇలాంటివారిలో కొందరు వ్యాయామ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పుడు పురుషులతో సమానంగా అతివలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారు. ఇందుకు ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం ముఖ్యం. మనిషి శారీరకంగా దృఢంగా ఉంటేనే ఇవన్నీ సమకూరుతాయి. అందుకే ఆరోగ్యంపై బాగా దృష్టిపెట్టారు. పురుషులతో పాటు మహిళలు జిమ్‌లకు వస్తున్నారు.



బరువు తగ్గేందుకు ఫిట్‌నెస్ అవసరం

శరీరంలో అధిక బరువును తగ్గించుకోవడం కోసం ఫిట్‌నెస్ ఉపయోగపడుతుంది. ఫిట్‌నెస్ వల్ల బరువు తగ్గించుకోవచ్చు. సంపూర్ణ ఆరోగ్యం ఉంటుంది, అందంగా ఉండవచ్చు. నేను రెండేళ్లుగా ఫిట్‌నెస్ కోసం వస్తున్నా. పది కేజీలు తగ్గాను.

- వినూత్న, కడప

గంట సమయం కేటాయించాలి



నేను వృత్తిరీత్యా డాక్టర్‌ను. సర్జరీ కోసం గంటలతరబడి నిలబడాల్సి వస్తుంది. అంత శక్తి కావాలంటే ఫిట్‌నెస్ అవసరం. నాలుగు నెలలుగా ఫిట్‌నెస్‌కు వెళ్తున్నా. నాలో స్ట్రెంత్ పెరిగింది. ఇపుడు నీరసం, అలసట లేదు. ఎంతసేపు అయిన కంటిన్యూగా నిలబడగలుగుతున్నా. ప్రతి ఒక్కరు ఫిట్‌నెస్ కోసం దినచర్యలో గంట కేటాయించాలి.

- బి.దీప్తి, డాక్టర్, ప్లాస్టిక్ సర్జన్, విభ ఆసుపత్రి, కడప

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాల్సిందే



ఇప్పుడంతా ఉరుకుల పరుగుల జీవనం. మనిషి లైఫ్‌స్టైల్ మారిపోయింది. ఫిట్‌నెస్ అనేది ప్రతి ఒక్కరికి అవసరం. ఇందుకోసమే ర్యాబిట్ ఫిట్‌నెస్‌ను కడప కేంద్రంగా స్థాపించాను. ఏపీ, తెలంగాణల్లో మొత్తం పదిచోట్ల సెంటర్లు ఏర్పాటుచేశాం. మహిళల కోసం ప్రత్యేక వర్కౌట్లు డిజైన్ చేశాం. మా వద్ద కార్డియో స్ట్రెంత్ వర్కవుట్లు ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజు గంటపాటు వర్కవుట్లు చేస్తే పీసీఓడీ లాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవు. మనిషి ఆరోగ్యంగా ఉంటే దేన్నైనా సాధిస్తారు.

- తుమ్మలూరు సాయిమహేశ్, ర్యాబిట్ ఫిట్‌నెస్ సెంటర్ సీఈఓ, కడప

చెరువు భూమికే పట్టా ఇచ్చేశారు...

- రెవెన్యూ అధికారుల రూటే సపరేటు.. ● రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు

కురబలకోట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు అధికారం మాదే...మమ్మల్ని ఎవ్వరా అడిగేది అన్న ధోరణితో విచ్చలవిడిగా ప్రవర్తించారు. వైసీపీ నేతల భూదాహానికి చెరువులు, వంకలు కనుమరుగయ్యాయి. దీనిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, ఆ పని మాత్రం చేయకపోగా వారికే మా మద్దతు అన్న విధంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో మండలంలోని పలుచోట్ల చెరువులు, డీకేటీ భూములను ఆక్రమించుకోగా ఆ భూములకు పట్టాలను కూడా మంజూరు చేసి అధికారులు తమ భక్తిని చాటుకున్నారు. కాగా చెరువుకు సంబంధించి 6.70 ఎకరాకు రమాదేవి అనే మహిళ పేరుతో పట్టా ఇచ్చిన ఘనత ఇక్కడి రెవెన్యూ అధికారులకే దక్కుతుంది.

కురబలకోట మండలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మండల పరిధిలో భూఆక్రమణదారులకు మద్దతు పలికిన అధికారుల తీరు వివాదాస్పదంగా మారింది. గతంలో వైసీపీ నేతలు చెరువులు, వంకలు, వాగులను అధికార అండతో ఆక్రమించుకుని సొమ్ము చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు అండగా నిలిచి డబ్బుకు ఆశపడి నిబంధనలను తుంగలో తొక్కి చేయకూడని పనులను అడ్డదారుల్లో కానిచ్చేశారు. మండలంలోని ఎర్రబల్లి పంచాయతీలో 22 ఏళ్ల క్రితం రైతుల కోసం అప్పటి ప్రభుత్వం చెరువును నిర్మించింది. కాగా చెరువు నిర్మాణానికి అవసరమైన భూములను పలువురు రైతుల నుంచి కొనుగోలు చేసి వారికి నష్టపరిహారాన్ని అందజేసింది. సర్వే నెంబర్లు 1871, 1872, 1876, 1877, 1878, 1879, 1881, 1882, 1883లలో 25.01 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసి చెరువును నిర్మించారు. దీంతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు రైతులు, మూగజీవాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అంతేకాకుండా చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతమంది ఆక్రమణదారుల కళ్లు చెరువుపై పడటంతో ఎలాగైనా ఆ భూములను కాజేయాలని ప్రయత్నాలు చేపట్టారు. దీంతో చెరువును ఆనుకుని రైతులకు చెందిన డీకేటీ భూములను రైతులకు డబ్బు ఆశ చూపి కారుచౌకగా కొనుగోలు చేశారు. అనంతరం ఆ భూములను ఆనుకుని ఉన్న చెరువుకు సంబంధించిన భూములను ఆక్రమించుకుని మొక్కలు నాటి కంచె వేశారు. చెరువుకు సంబంధించిన 1879, 1881 సర్వే నెంబర్ల భూములలో 6.70 ఎకరాల భూమికి 3252 ఖాతా మీద రమాదేవి పేరు మీద రెవెన్యూ అధికారులు పట్టాను మంజూరు చేశారు. ఇందులో భారీ స్థాయిలో డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ప్రభుత్వ, డీకేటీ భూములను ఇతరుల పేరు మీద మార్చి వన్‌బీ అడంగల్ హక్కును కల్పించడం చట్టరీత్యా సాధ్యం కాదు. పేద, నిరుపేదలకు బతుకుదెరువు నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ పట్టా భూమిని వంశపారంపర్యంగా అనుభవించుకోవాలే కానీ ఇతరులకు క్రయ, విక్రయాలు జరిపి ఇతరులకు అప్పగించడం నిబంధనల మేరకు చేయకూడదు. ఒకవేళ భూయజమాని తమ అవసరానికి అమ్మినా, తాకట్టు పెట్టినా నిబంధనల మేరకు చెల్లుబాటు కాదన్న విషయం బహిరంగ రహస్యమే. అలాంటిది చెరువు భూమికి వన్‌బీ కల్పించి అప్పనంగా అప్పగించేశారు. చెరువు ఆక్రమణ విషయమై రెవెన్యూ అధికారులకు పలుమార్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపానపోలేదు. కాగా ఆక్రమణకు గురైన చెరువును స్వాధీనం చేసుకుని పూర్వపు స్థితిని తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



చెరువు భూమికి పట్టా చేయించుకుని కంచె వేసిన దృశ్యం



చెరువు భూమికి ఇచ్చిన వన్‌బీ

విచారణ చేసి పట్టా రద్దు చేస్తాం

మండలంలోని కంటేవారిపల్లె సమీపంలోని కొత్తచెరువు (లోతువంక)ను చెరువుకు సంబంధించిన భూములను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంటాం. గతంలో చెరువు భూమికి సంబంధించిన సర్వే నెంబర్లకు పట్టాను గతంలో మంజూరు చేసినట్లు ఇటీవల నా దృష్టికి వచ్చింది. కాగా చెరువుకు సంబంధించి ఆక్రమణలకు గురైన భూమిని సర్వే చేసి తేలితే ఆక్రమణలను తొలగిస్తాం. దీనిపై విచారణ జరిపి నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పట్టా రద్దు చేస్తాము.

- తపస్విని, తహసీల్దార్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచండి



సమీక్షలో మాట్లాడుతున్న ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్

రాయచోటిటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్ ప్రవేశాలను పెంచాలని ఓపెన్ స్కూల్ స్టేట్ కో-ఆర్డినేటర్ అక్బర్‌అలీ తెలిపారు. ఓపెన్ స్కూల్ నిర్వహణపై అడ్మిషన్ల పెంపుదలపై శనివారం రాయచోటి డైట్ కళాశాలలో రాయచోటి ప్రాంత ఏఐ కో-ఆర్డినేటర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు వేల అడ్మిషన్లు పూర్తయ్యాయని, ఈ సంఖ్య మరింత పెంచేలా కృషి చేయాలన్నారు. పదో తరగతి ఫెయిల్ అయి చదువు మధ్యలో మానేసిన వారికి ఈ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ 200 రూపాయల అపరాధ రుసుంతో ఈనెల 29వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 30, 31వ తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షామీర్‌బాషా, జాబీర్, ఏఐ కో-ఆర్డినేటర్లు అక్బర్‌అలీ, మధుసూదన్, అంజి, హనుమంతురావు, రమణ, ప్రభాకర్, శ్రీనివాసులు, రాజగోపాల్, రాజశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నలుగురు స్మగ్లర్లు

- 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) :: సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలోని బొల్లువాండ్లపల్లె సమీపంలో శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చే సుకున్నట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసుల కథనం మేరకు వివరాల్లోకి వెళితే... సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రా మం బొల్లువాండ్లపల్లె సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ దాడుల్లో చిన్నగొల్లపల్లి గ్రామం పూజారివాండ్లపల్లెకు చెందిన పూజారి నాగరాజతో పాటు మరో ముగ్గురు తమిళ స్మగ్లర్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు అదుపులోకి తీసుకొని 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే దాడుల సమయంలో ప్రధాన స్మగ్లర్ అయిన దుద్యాల శేఖర్‌రెడ్డి అతడి అసిస్టెంట్ నరసింహులుతో పాటు తూర్పు హరిజనవాడకు చెందిన నాగార్జున, రెడ్డెయ్య, సుబ్రమణ్యం, మరికొంతమంది సంఘటనా స్థలం నుంచి పరారైనట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెబుతున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ములకలచెరువు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి సుదర్శన్‌నాయక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలులో శనివారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-19 అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. హైజంప్‌లో 1.72 మీటర్లు దూకి రాష్ట్ర స్థాయిలో రెండవ స్థానం సాధించాడు. అలాగే ట్రిపుల్‌జంప్‌లో కూడా 12.45 మీటర్లు జంప్ చేసి రెండవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబరు 25వ తేదీ ఝార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ అల్తాఫ్‌భాను, పీడీ సుజావుద్దీన్ తెలిపారు.

క్రీడాకారులను దూషించిన కోచ్..

- రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు

వాల్మీకిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ కోచ్ నాగరాజుపై రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజుకు కొందరు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలిల ఉన్నాయి. అండర్-17 బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎన్నికైన వాల్మీకిపురానికి చెందిన లలిత్‌కుమార్, గిరిధర్, అరవింద్‌లు రెండురోజుల క్రితం చిత్తూరులో శిక్షణ అనంతరం శుక్రవారం సాయంత్రం చిత్తూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరారు. మార్గమధ్యంలో కోచ్ నాగరాజు వాల్మీకిపురం క్రీడాకారులను రైలు ఎక్కిన సమయం నుంచి దుర్భాషలాడారు. అంతేకాక వాల్మీకిపురం క్రీడాకారులకు ట్రైన్‌లో రిజర్వేషన్ లేకపోవడంతో టీసీ చెకింగ్‌కు వచ్చినపుడు జరిమానా కడతామని వారు చెప్పినా వినకుండా కోచ్ వారిని నానా మాటలు అనడంతో ముగ్గురు క్రీడాకారులు ఒక్కొక్కరుగా రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు రైల్వేస్టేషన్‌లలో దిగిపోయి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో క్రీడాకారుల తల్లిదండ్రులు వెళ్లి వారి పిల్లలను వాల్మీకిపురం తీసుకుని వచ్చారు. ఈ విషయమై క్రీడాకారుల తల్లిదండ్రులు పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సావిత్రి, రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజుకు ఫోన్ ద్వారా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తూ క్రీడల్లో తమ పిల్లల భవిష్యత్తుతో ఆట్లాడుకుంటున్న సంబంధిత కోచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక బాస్కెట్ బాల్ సీనియర్ క్రీడాకారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

ఉల్లి రైతు కంట కన్నీరు

- ఒక్కసారిగా కుదేలైన ధర
- పంట చేతికందే సమయంలో కుళ్లు తెగులు
- తుఫాన్ దెబ్బకు పంట నాశనం

(5వపేజీ తరువాయి)

వ్యాపారులు టన్ను ఉల్లి నాణ్యతను బట్టి రూ.20వేల నుంచి రూ.35వేల వరకు కొనుగోలు చేశారు. రైతులు ఒక్కసారిగా పంటను తొలగించి అమ్మేందుకు సిద్ధమయ్యారు. దీనితో వ్యాపారులు ధరను తగ్గిస్తూ వచ్చారు. రెండు మూడు రోజులుగా రైతులు ఉల్లిగడ్డలను పొలం నుంచి తీసి అమ్మకానికి సిద్ధం చేసినా వ్యాపారులెవరు పొలాలవైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. పొలాల వద్ద ఉల్లి పంటను రైతులు ఆరబోసుకొని కంటిమీద కునుకు లేకుండా వ్యాపారుల కోసం ఎదురుచూస్తున్నారు. కొందరు సమీప మార్కెట్‌యార్డులకు తరలిస్తున్నారు. వేముల మండలంలో ఓ రైతు పంటను వ్యాపారి టన్ను రూ.29వేలతో కొనుగోలు చేశారు. ఒకటి రెండురోజుల్లో తూకం వేసుకొని మార్కెట్‌కు తరలిస్తానని అడ్వాన్స్ ఇచ్చాడు. ధర తగ్గడంతో వ్యాపారి రాలేదు. దీనితో పంట పాడవుతుందని రైతు పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆ వ్యాపారికి ఫోన్ చేసి చెప్పడంతో అతను వచ్చి రైతునుంచి ఉల్లి కొనుగోలు చేశాడు.



ఉల్లిపంటను తొలగిస్తున్న కూలీలు

గ్రేడింగ్‌తో భారీ నష్టం

జిల్లాలోని పలువురు రైతులు కర్నూలు, తాడేపల్లి మార్కెట్ యార్డులకు ఉల్లిగడ్డలను తరలిస్తున్నారు. కొందరు ఎర్రగుంట్ల మార్కెట్‌యార్డుకు ఉల్లిగడ్డలను అమ్మకానికి తీసుకొస్తున్నారు. అయితే అక్కడ వ్యాపారులు ఉల్లిగడ్డలను గ్రేడింగ్ చేస్తున్నారు. గ్రేడింగ్ తర్వాత కిలోకు పావు కిలో కూడా రావడంలేదని దీతో తాము భారీగా నష్టపోతున్నామని రెతులు అంటున్నారు. గ్రేడింగ్ తర్వాత వచ్చే ఉల్లిని అలాగే వదిలేయాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి

ఉల్లిసాగుకు ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. సేద్యం, నీళ్ల బాడుగ (బోర్లులేని వారికి), విత్తనాలు, ఎరువులు, ఎకరాకు 12సార్లు మందులు, కూలీలు, పిండి, ట్రాక్టర్ బాడుగలు ఇలా మొత్తం ఎకరాకు రూ.90వేల నుంచి లక్షకు చేరుకున్నాయి. ఎకరా ఉల్లిపంటను పీకి కోసేందుకే రూ.22వేల నుంచి రూ.25వేలు ఖర్చవుతోందని అంటున్నారు.

ఎకరాకు 25క్వింటాళ్లే

ఎకరాకు వంద క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు వర్షం కారణంగా పంట దెబ్బతినడంతో తీవ్ర నిరాశే మిగిలింది. ఎకరాకు కేవలం 25క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కుళ్లతెగుళ్లతో గడ్డ నాణ్యత లేకపోవడంతో ధర టన్ను రూ.10 వేల నుంచి రూ.15వేలు మాత్రమే పోతోంది. గత సంవత్సరం ఇదే పంట టన్ను రూ.40వేలు కూడా పలకడంతో రైతులకు మంచి లాభం వచ్చింది. దీన్ని ఆసరాగా చేసుకుని రైతులు ఉల్లిసాగుకు ఎక్కువ మంది ముందుకొచ్చారు. తీరా పంట కోత దశలో తుఫాన్ ప్రభావంతో దిగుబడి బాగా తగ్గింది. దీనికి తోడు రేటుకూడా లేకపోవడంతో రైతులు భారీగా నష్టపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వీరుకోరుతున్నారు.



తెగులు సోకడంతో పొలం గట్లపై ఆరబెట్టిన దృశ్యం

మూడెకరాలకు రూ.2.70లక్షలు నష్టం..



మూడెకరాల్లో ఉల్లిసాగు చేశాను. ఎకరాకు కేవలం 20క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎకరాకు సుమారు రూ.95వేలు ఖర్చుచేశాను. తుఫాన్ కారణంగా దిగుబడి బాగా తగ్గింది. దీనికితోడు గడ్డ నాణ్యతగా లేదని ధర తగ్గించేశారు. క్వింటాకు కేవలం రూ.1300మాత్రమే ఇస్తున్నారు. గ్రేడింగ్‌లో 75శాతం గడ్డలు పక్కకు పడేశారు. వాటన్నింటిని పారేయాల్సి వస్తోంది. కనీసం కూలీల ఖర్చు కూడా రాలేదు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇచ్చి ఆదుకోవాలి.

- వడ్డమాని మల్లికార్జునరెడ్డి, రైతు, సుంకేసుల

వర్షాలకు పంట దెబ్బతింది..



ఇటీవల తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు ఉల్లిపంట దెబ్బతింది. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంట పొలాల్లోనే కుళ్లిపోయే పరిస్థితి దాపురించింది. టన్ను ఉల్లి రూ.35 వేలు పలికాయి. నేడు రూ.10వేల నుంచి రూ.15వేలు మాత్రమే పలుకుతోంది. అదికూడా వ్యాపారులు కొనేందుకు ముందుకు రావడం లేదు.

- ఈశ్వరయ్య, కొమ్మద్ది, వీరపునాయునిపల్లె మండలం

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించండి

- అఖిలపక్ష కమిటీ నేతలు

కడప మారుతీనగర్ అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సందర్భంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ ఇస్తామన్న హామీ మేరకు అవసరమైన నిధులు కేటాయించేలా ప్రాధాన్యత కల్పించాల్సిన ఆవశ్యకత పాలక ప్రభుత్వాలపై ఉందని అఖిలపక్ష కమిటీ నేతలు నారాయణరెడ్డి, సీఆర్వీ ప్రసాద్, ఎస్.ఏ. సత్తార్, దేవర శ్రీకృష్ణ, సగిలి గుర్రప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన చట్టంలో పొందుపరచినట్లు జిల్లాలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటుచేస్తామన్న హామీని పాలకులు ఏ మాత్రం పట్టించుకోక కాలయాపన చేయడం విడ్డూరంగా వుందన్నారు. పైపెచ్చు ఎంతసేపూ అమరావతి అంటూ పాటపాడడం సరికాదన్నారు. రాష్ట్రానికి తోడు కేంద్రం కూడా అదే పాటకు వంతపాడుతూ వెనుకబడిన ప్రాంతాలను పూర్తిగా విస్మరించారన్నారు. ఇప్పటికైనా కుట్రపూరిత రాజకీయాలు విడనాడి అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ప్రధానంగా ఈ ప్రాంత గాలేరునగరి ప్రాజెక్ట్ ఇప్పటికే 70శాతం, తెలుగుగంగ ప్రాజెక్ట్ 80 శాతం పనులు మాత్రమే జరిగి నేటికీ అసంపూర్తిగా వున్నాయని, ఆ ప్రాజెక్ట్‌లను పూర్తి చేసేందుకు సిద్ధం కావాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు.

ఆర్ట్‌కాంపిటీషన్‌లో ఏఎఫ్ఏయూ విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రారు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఐ ఆర్ట్ కాంపిటీషన్‌లో ఏఎఫ్ఏయూ విద్యార్థి హరినాయక్ ప్రతిభ చాటారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ జోనల్ రాష్ట్ర స్థాయిలో ఆర్ట్ కాంపిటీషన్ నిర్వహించింది. ఇందులో కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్‌ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెయింటింగ్ మూడో సంవత్సరం విద్యార్థి హరినాయక్ ఎంపికయ్యారు. రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో ఢిల్లీలో 23న పోటీలో దేశ వ్యాప్తంగా 71 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో వైఎస్ఆర్ ఏఎఫ్ఏయూ విద్యార్థి ఎంపికవడం పట్ల వైస్‌ఛాన్సలర్ విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి విద్యార్థిని అభినందించారు.


విద్యుత్తు ఉద్యోగి బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దువ్వూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న నాయబ్‌రసూల్‌ను మైదుకూరు సబ్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి దినపత్రికలో లైన్‌మెన్ నాయబ్‌రసూల్ వ్యవహార శైలి, అవినీతి పనులపై 'ఎవరైతే నాకేంటి' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీతో స్పందించిన అధికారులు ఆయనను మైదుకూరు సబ్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఈఈ భరణిక్రిష్ణ తెలిపారు. తదుపరి లైన్‌మెన్‌గా ఉండి మండలంలో ఈయన చేసిన అక్రమాలు, అవినీతి పనులు రైతులను, వినియోగదారులను ఇబ్బందికి గురిచేసిన వ్యవహారాలపై విచారణ జరుపనున్నట్లు ఆయన చెప్పారు. విచారణ అనంతరం చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

మైలవరానికి 13000 క్యూసెక్కులు విడుదల

అవుకు నుంచి ఇన్‌ఫ్లో 14000 క్యూసెక్కులు


మైలవరం జలాశయానికి విడుదలవుతున్న నీరు

కొండాపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గండి కోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి శనివారం 13000 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. కాగా ప్రాజెక్టులోకి అవుకు రిజర్వాయిర్ నుంచి జీఎన్ఎస్ఎస్ వరద కాల్వ ద్వారా 14000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నట్లు డీఈ తెలిపారు. మెయిన్‌కెనాల్‌కు 75 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.02 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు డీఈ తెలిపారు.

ర్యాగింగ్ దుష్టసంస్కృతికి చరమగీతం పాడుదాం

ర్యాగింగ్ నేరం, నిషేధం పోస్టరు ఆవిష్కరణ

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ దుష్ట సంస్కృతికి చరమగీతం పాడి స్నేహపూర్వత వాతావరణంలో చదువులు కొనసాగించాలని రిజిస్ట్రారు ఆచార్య పి.పద్మ అన్నారు. విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి, ర్యాగింగ్ నేరం, ర్యాగింగ్ నిషేధం పోస్టరును ఆవిష్కరించారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 ప్రకారం శిక్షలను అమలు చేస్తారన్నారు. యాంటిర్యాగింగ్ పర్యవేక్షణ కమిటీలు వసతిగృహాలు, విద్యాలయంలో పనిచేస్తున్నాయని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్‌వీ క్రిష్ణరావు, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేశ్‌బాబు పాల్గొన్నారు.

నంద్యాలంపల్లిలో వ్యక్తిపై దాడి- కేసునమోదు


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐ

సింహాద్రిపురం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలంపల్లిలో శుక్రవారం రాత్రి మహేశ్వర్‌రెడ్డిపై జరిగిన దాడిపై కేసు నమోదు చేసినట్లు సింహాద్రిపురం ఎస్ఐ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి దాడి చేసి గాయపరిచార న్నారు. గాయపడిన మహేశ్వర్‌రెడ్డిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గతంలో వారి మధ్య ఉన్న పాతకక్షలవల్లే దాడికి కారణమని ఎస్ఐ తెలిపారు. బాధితుడు మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెడికల్ స్టోర్స్ తనిఖీ చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్


మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధురి

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో నిబంధనలు అతిక్రమించి మందులు అమ్ముతున్న 10 మెడికల్ స్టోర్లపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మాధురి, జయరాముడు తెలిపారు. ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో మత్తు కోసం యువత.. అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన కడప డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మాధవి శనివారం నగరంలోని మెడికల్ స్టోర్‌లలో తనిఖీ చేపట్టారు. మత్తు ట్యాబ్లెట్లు విక్రయాలపై రికార్డులను పరిశీలించారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే మత్తు ట్యాబ్లెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖచ్చితం గా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. కొన్ని మెడికల్ షాపుల్లో మత్తుమందు విక్రయాలపై సరైన సమాచారం లేకపోవడంతో చర్యలు కోసం మెడికల్ స్టోర్‌పై నివేదిక తయారు చేసి అధికారులకు పంపించారు. మత్తుమందుల వల్ల యువత పాడవుతున్నారని ఎవరైనా మత్తు ఉన్న మందులు అమ్మితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని మాధురి హెచ్చరించారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోబరు26:(ఆంధ్రజ్యోతి) కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. శనివారం తమకు వచ్చిన సమాచారం మేరకు చీకలబైలు సమీపంలో నక్కలదిన్నెకు చెందిన శంకర్ నాయక్ కర్ణాటక మద్యం తరలిస్తున్న ఆయనను అదుపులోకి తీసుకుని కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పాడి గేదె కోసం వెళ్తూ...

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి ● ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం

తండ్రికి తీవ్ర గాయాలు ● ఆస్పత్రిలో కుటుంబీకుల రోదన


ఘటనస్థలంలో గంగాధర్‌రెడ్డి మృతదేహం, (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో) గాయపడిన తండ్రి వెంకటరమణారెడ్డి

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జీవనం కోసం పాడిగేదెను కొనేందుకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై గంగాధర్‌రెడ్డి (38) దుర్మరణం చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలం చేరుకుని పరిశీలించారు. ఎస్ఐ తిరుపాల్‌నాయక్ అందించిన వివరాల్లోకెళితే....

వీరపునాయునిపల్లె మండలం మొయిళ్లచెరువు వాసి వెంకటరమణారెడ్డి కుటుంబం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తోంది. అయితే అరకొర సంపాదనతో కుటుంబం నెట్టుకురావడం భారమైంది. పాడి గేదె ఉంటే చేదోడువాదోడుగా ఉంటుందనుకుని గేదెను తెచ్చుకునేందుకు తండ్రీ కొడుకులు వెంకటరమణారెడ్డి, గంగాధర్‌రెడ్డి శనివారం ఉదయం బుల్లెట్‌లో ఇంటి నుంచి బయలుదేరారు. వేంపల్లె దాటి చక్రాయపేటకు వెళ్తుండగా పాపాఘ్ని నది నుంచి ఇసుకను తరలిస్తూ అధిక వేగంగా వచ్చిన ట్రాక్టర్ బుల్లెట్‌ను ఢీకొంది. దీంతో గంగాధర్‌రెడ్డి తలకు బలమైన గాయాలై రక్తపు మడుగులో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. తండ్రి రమణారెడ్డికి కాలు విరిగింది. పలుచోట్ల గాయాలయ్యాయి. స్థానికుల సహకారంతో గాయపడిన తండ్రి రమణారెడ్డిని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని భోరున విలపించారు. యువకుడి భార్య జ్యోతి, బంధువుల రోదనలతో ఆస్పత్రి ఆవరణలో గంభీరవాతావరణం నెలకొంది. భర్త మృతదేహం వద్ద ఎక్కడి పోయినావు లేయ్ అంటూ ఆమె ఏడుస్తున్న దృశ్యం అందరినీ కలచివేసింది. ఇంట్లో పాడి ఉంటే బాగుంటుంది కుటుంబానికి ఆసరాగా ఉంటుందని తెచ్చుకోవడానికి వెళ్తూ ఈ ప్రమాదం జరగడం చూసిన వారంతా ఆవేదన వ్యక్తపరిచారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టీడీపీ మైనార్టీ సెల్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, ఇతర నేతలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిడుగుపల్లె వద్ద....



కలసపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పిడుగుపల్లె సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి పుల్లారెడ్డిపల్లె వాసి గుడిమె గురయ్య (27) మరణించాడు. ఈ ప్రమాదంలో తంబళ్లపల్లె గ్రామానికి చెందిన మౌళాలికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు బద్వేలు వద్ద ఉన్న సెంచురీ పార్కులో విధులు నిర్వ హిస్తుంటారన్నారు. వీరు ఇంటికి వస్తుండగా సంఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించారు. మృతునికి 3 నెలల కిందటే వివాహం జరిగింది. సంఘటనా స్థలానికి కలసపాడు ఎస్ఐ చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధిపత్యం కోసమే కూల్చేశారు

అభయాంజనేయ స్వామి ఆలయంకూల్చివేతలో ఇద్దరు అరెస్టు : డీఎస్పీ కొండయ్యానాయుడు


నిందితులతో డీఎస్పీ కొండయ్యానాయుడు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పూజారుల ఆధిపత్యం కోసమే అభయాంజనేయ స్వామి ఆలయాన్ని కూల్చేశారని మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ వెల్లడించిన వివరాల్లోకెళితే...

ములకలచెరువు మండలం, కనుగొండ అటవీప్రాంతంలో అభయాంజనేయస్వామి ఆలయం ఉంది. కనుగొండ స్వామి ఆలయ పూజారి హరినాద్‌యాదవ్, అభయాంజనేయస్వామి ఆలయం పూజారి విద్యాసాగర్‌కు కొంత కాలంగా మనస్పర్ధలున్నాయి. అభయాంజనేయస్వామి ఆలయం తన అధీనంలోకి తెచ్చుకుని వచ్చే ఆదాయం తాను పొందాలనే ఉద్దేశంతో ఆలయం వదలి వెళ్లాలని విద్యాసాగర్‌ను బెదిరించేవాడు. చివరికి గుడి కూలగొడితే ఖాళీ చేసి వెళ్లిపోతాడని హరినాద్ యాదవ్ పథకం రూపొందించారు. ఇందులో తనకు తెలిసిన నక్కల వెంకటనారాయణ, షేక్ ఈదుల్లా సహకారం తీసుకున్నారు. గుడిలో గుప్తనిధులున్నాయని వారం రోజుల కిందట గుణపాలతో తవ్వారు. వీలుకాకపోవడంతో వెంకటనారాయణ, ఈదుల్లా కలిసి నాటుబాంబులతో 14న గుడిని పేల్చారు. వీటిని కూడా తనకల్లు సమీపంలో మూతపడిన క్వారీ కోసం తెచ్చుకున్న నాలుగు నాటుబాంబుల్లో గుడిపేల్చడానికి రెండింటిని ఉపయోగించారు. దీంతో మొలకలచెరువు మండలం మదనపల్లె రోడ్డు, తంబళ్లపల్లె క్రాస్ వద్ద ఉన్న సత్యసాయి జిల్లా, తనకల్లు మండలం, టి. సదుం వాసి పెద్దన్న కుమారుడు నక్కల వెంకటనారాయణ, కొక్కంటి క్రాస్ వద్ద ఉన్న రెడ్డిబాష కుమారుడు షేక్ ఈదుల్లాను శుక్రవారం అరెస్టు చేశారు. కాగా ఇందుకు వాడిన మారుతీ కారు, రెండు పెద్ద సమ్మెట్టలు, రెండు గడ్డపారలు, ఒక సుత్తి, రాళ్లు చెక్కే ఉలిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో హరియాదవ్, లక్ష్మీనారాయణ, రాఘవేంద్రాచారి, మధు, మహేశ్వర్‌రెడ్డి నిందితులను 17న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మిగిలిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు, ములకలచెరువు సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయిత్రి, పోలీసులు పాల్గొన్నారు.

పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదు

ఇంపాక్ట్ ప్రతినిధి ప్రేమానందరెడ్డి


కౌన్సెలింగ్ ఇస్తున్న ఇంపాక్ట్ ప్రతినిధి ప్రేమానందరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదు, ఒత్తిడికి లోనవకూడదు ఈ రెండు పోవాలంటే యోగా, ధ్యానం, కొన్ని వ్యాయామాలు చేయాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ కౌన్సెలింగ్ ట్రైనర్ ప్రేమానందరెడ్డి తెలిపారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలబాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పరీక్షలపై శనివారం కౌన్సెలింగ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు తగు సూచనలిస్తూ ఏకాగ్రత కలిగి ఉండి క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎలాంటి వాటినైనా ఎదుర్కోవచ్చన్నారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు


నిందితుడితో సీఐ నాగభూషణ్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్

గోపవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడు తిప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల్లోకెళితే....

శ్రీనివాసపురం వాసి తాను పదేళ్లగా తాగుడుకు బానిసవడంతో తనకు తల్లిదండ్రులు తనకు పెళ్లిచేయ లేదు. దీంతో వారిని తరచూ వేధింపుల్లో భాగంగా తన తల్లిని కొడుతున్నప్పుడు ఆమె తన చిన్నాయన ఇంటి వద్దకు వెళ్లిన ప్రతిసారి అతడు తనను తాగుబోతు అని తిట్టేవాడు. మూడు నెలల కిందట తనను చెంప మీద కొట్టడంతో మనసులో పెట్టుకుని అతనిపైకక్ష కట్టి 22న రాత్రి కత్తెరతో పొడిచి హత్య చేసినట్లు తెలిపారు. నిందితున్ని రిమాండుకు పంపించామని రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

మహిళకు తీవ్రగాయాలు

బి.కొత్తకోట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో చౌడమ్మ తీవ్రంగా గాయపడింది. మదనపల్లె పట్టణం నీరుగట్టివారిపల్లె వాసి రవి భార్య చౌడమ్మ కుటుంబీకులతో కలిసి బి.కొత్తకోట కు వచ్చింది. తిరుగు ప్రయాణంలో తన తమ్ముడితో కలిసి మదనపల్లెకు బయలుదేరగా వాహనం కాండ్లమడుగు క్రాస్ వద అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించారు.

హెడ్‌కానిస్టేబుల్ వీఎం బాషా సస్పెండ్

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ వీఎం బాషాను సస్పెండ్ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కడప తాలుకా పోలీసు స్టేషన్ పరిధిలో శివక్రిష్ణ స్థలం కొనుగోలు విషయంలో రామక్రిష్ణ, రామాంజనేయరెడ్డితో కలిసి హెడ్ కానిస్టేబుల్ బాషా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని ఫిర్యాదుపై కడప తాలుకా పోలీసుస్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదైంది. విచారించిన ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ బాషాను సస్పెండ్ చేశారు. గతంలో ఇతనిపై ఎర్రచందనం, భూ ఆక్రమణ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మరో కేసు నమోదు కావడంతో మరోమారు సస్పెండ్‌కు గురయ్యారు.

అంతర్ రాష్ట్ర దొంగల అరెస్ట్

● 96 గ్రాముల బంగారు నగలు స్వాధీనం


వెంకటసుబ్బయ్య - అమర్‌రాజ్‌కుమార్

సిద్దవటం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పలు చోరీల్లో నిందితులు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అట్లూరు మండలం చలంగారిపల్లెకు చెందిన గుమ్మాల వెంకటసుబ్బయ్య, బద్వేల్ టౌన్ కుమ్మరి కొట్టాల్లో నివాసం ఉంటున్నారు. అన్నమయ్యజిల్లా అత్తిరాలకు చెందిన జి.కుమార్ అలియాస్ అమర్‌రాజ్‌కుమార్ ప్రస్తుతం కడప తిలక్‌నగర్‌లోని జగనన్నకాలనీలో నివాసం ఉంటున్నాడు. వీరిద్దరూ బైక్‌లో పారిపోతుండగా బాకరాపేట వద్ద అదుపులోకి తీసుకుని 96 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో విజయవాడ, తూర్పుగోదావరి, తిరుపతి, ప్రకాశం, మైదుకూరు, సుండుపల్లె ఓడీ చెరువు, కలువాయి, పొదలకూరుల్లో చోరీలకు పాల్పడ్డారని, వీరిపై 25 కేసులు ఉన్నట్లు తెలిపారు. గతంలో పీడీ యాక్టులో జైలుకు వెళ్లినట్లు వివరించారు.

సేవాభావంతో వైద్యసేవలు అందించాలి


తెల్ల కోటు తొడుగుతున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్


కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వైద్యవృత్తి పవిత్రమైనదని అంకితభావంతో వైద్యవిద్య నేర్చుకుని సేవాభావంతో వైద్యసేవలు అందించాలని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ్ అన్నారు. శనివారం వైద్యకళాశాలలో నూ తన వైద్యవిద్యార్థులకు వైట్ కోటును ధరింపజేసి ప్రతిజ్ఞ చేయించారు.

చిన్నారి మృతి

ఖాజీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చెముళ్లపల్లె పంచాయతీ బీసీ కాలనీలో టిన్నర్ తాగి మూడేళ్ల చిన్నారి కరీముల్లా మృతిచెందాడు. వివాహ వేడుకల్లో భోజనానికి చేయడంలో మంట వెలిగించేందుకు టిన్నర్ వాడి పక్కనబెట్టారు. అదే గ్రామానికి చెందిన మస్తాన్ కుమారుడు కరీముల్లా ఆడుకుంటూ వెళ్లి తీసుకుని తాగాడు. ఎవరూ గమనించకపోవడంతో పిల్లవానికి నోట నురుగు రావడం గమనించి చికిత్స నిమిత్తం కడపరిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలపడంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. తండ్రిమాత్రం కువైట్‌లో బతుకుదెరువుకోసం వెళ్లాడు. ఆయనకు ఇద్దరు కుమాలు, ఒక కుమార్తె ఉన్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

కలసపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి గ్రామంలో ముత్తుమల జయరామిరెడ్డి పాడిగేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఉదయం మేతకు తోలుకెళుతుండగా సింగల్‌ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గేదెకు తగిలి మృతి చెందింది. గేదె విలువ రూ.60వేల వరకు ఉంటుందని పాడి రైతు తెలిపారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు.



పండుగలా టీడీపీ సభ్యత్వ నమోదు: వికాస్ హరిక్రిష్ణ


శాశ్వత సభ్యత్వం తీసుకుంటున్న జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక పండుగలా జరుగుతోందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే కా ర్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక పండుగ వాతావరణంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోందన్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో రూ.2లక్షలు ఉన్న ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచారన్నారు. అలాగే సభ్యత్వం ఉన్న వ్యక్తి చనిపోతే అంత్యక్రియలకు రూ.10వేలు ఇస్తారన్నారు.

జేఎన్టీయూలో ముగిసిన యంత్ర 2కె24

పులివెందుల రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ కళాశాలలో మూడురోజుల పాటు జరిగిన యంత్ర-2కె24 శనివారంతో ముగిసింది. ముఖ్య అతిథులుగా రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ వెంకటరమణ, హార్టికల్చర్ కళాశాల ప్రిన్సిపాల్ రామాంజనేయరెడ్డి, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్ హాజరయ్యారు. ప్రశంసాపత్రాలను అందించారు.

తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యత్వం అందిస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదు 2024-26 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యా ప్తంగా ప్రారంభించారన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసిందని, ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు పొంది లబ్ధి పొందాలన్నారు. పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు. సభ్యత్వ నమోదు పొందడం వల్ల రూ.5లక్షలు ప్రమాద బీమా అవకాశం ఉందన్నారు.

టీడీపీ బలోపేతానికే సభ్యత్వ నమోదు: గోవర్ధన్‌రెడ్డి


సభ్యత్వ నమోదులో పాల్గొన్న గోవర్ధన్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 25 మందికి సభ్యత్వాన్ని అందించామన్నారు. **మాసాపేటలో**...కడప నగరం మాసాపేట సర్కిల్‌లో టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు మాసాపేట శివ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమానికి కడప ఎమ్మెల్యే మాధవి హాజరై సభ్యత్వాన్ని అందించారు.

సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధిద్దాం

● నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవి


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్సీ రవీంద్రనాథ్‌రెడ్డి

పులివెందుల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో పులివెందుల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుదాం అని పులి వెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ మన నియోజకవర్గంలో 80వేలు సభ్యత్వ నమోదు లక్ష్యం ఉందని, ఆ లక్ష్యాన్ని చేరుకుందామన్నారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పులివెందులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు మాట ఇచ్చారని, సభ్యత్వ నమోదు తరువాత అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కావున ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విరివిగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పార్థసారథిరెడ్డి, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, సంజీవరెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యాదీవెన, వసతిదీవెన నిధులు విడుదల చేయాలి'


ఆర్‌జేడీలకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పెండింగులో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన నిధులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, టీఎన్‌ఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, పీఎస్‌యూ, ఏఐఎస్‌బీ ప్రతినిధులు డి మాండ్ చేశారు. జీఓ నెం.77ను రద్దు చేయాలని కోరారు. శనివారం కడప నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థి సంఘాలతో ఆర్‌జేడీలు, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేశ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, అధ్యక్షుడు శివశకంర్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనరు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి: పీడీఎస్‌యూ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ పరీక్షల ఫీజు పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌ఐఓ కార్యాలయంలో ఏఓ నల్లపురెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కడప, బద్వేలు, జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందులు ప్రాంతాల్లో బోర్డు నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు విఘ్నేశ్, మహేశ్, సుభన్ తదితరులు పాల్గొన్నారు.

'సీడీపీఓను సస్పెండ్ చేయాలి'


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీ వర్కర్లను వేధింపులకు గురి చేస్తున్న కడప సీడీపీఓను తక్షణం సస్పెండ్ చేయాలని కడప కలెక్టరేట్ వద్ద ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ కడప సెంటరులో పర్యవేక్షణ పేరుతో అంనగ్వాడీ వర్కర్లను సీడీపీఓ బెదిరించి భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. ధర్నాలో సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, అంగన్వాడీ యూనియన్ కడప అర్బన్ సెక్రటరీ విసీల, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

వల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):సిమెంటు రోడ్లను వెంటనే పూర్తి చేయాలని పీడీ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం గంగాయపల్లెలో చేపడుతున్న సీసీ రోడ్లు, మినీగోకులం పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు.



చింతకొమ్మదిన్నె చెత్తకొమ్మదిన్నెగా మారింది. అక్కడ నివాసం ఉన్న వారు, వివిధ పనుల నిమిత్తం అటుగా వెళ్లేవారు దుర్వాసనతో ఇబ్బందిపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - సీకేదిన్నె, (ఆంధ్రజ్యోతి)

వార్డు హెల్త్ సెక్రటరీపై విచారణ చేపట్టాలి: కమిషనర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రవీంద్రనగర్ సచివాలయంలో చిన్నారికి టీకా ఇంజక్షన్ ఇచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోలేదని వచ్చిన ఫిర్యాదుపై వార్డు హెల్త్ సెక్రటరీపై ప్రత్యేక అధికారి ద్వారా విచారణ చేయించాలని కమిషనర్ మనోజ్‌రెడ్డి ఎంహెచ్‌ఓకు ఆదేశించారు. శనివారం రవీంద్రనగర్ 6వ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారికి ఇంజక్షన్ ఇవ్వడంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం ద్వారా ఇబ్బందులు తలెత్తాయని ఫిర్యాదు వచ్చిందన్నారు. దీనిపై విచారణ జరిపించి నిజమని తేలితే సస్పెండ్ చేయాలని సూచించారు.

జగన్‌రెడ్డిని అభాసుపాలు చేయడం సరికాదు

● వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి

కడప మారుతీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డిని రాజకీయంగా మరింత అభాసుపాలు చేయడమే లక్ష్యంగా ఆయన స్వంత చెల్లెలు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పావులు కదుపుతున్న తీరు సరైందికాదని వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సతీశ్‌రెడ్డి అన్నారు. ఆ మేరకు శనివారం ఆయన కడప ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ఎన్నికల్లో స్వంత అన్న అనే కనికరం లేకుండా జగన్‌రెడ్డిని అధికారం నుంచి గద్దెదించేందుకు షర్మిల చాలా గట్టి ప్రచారం చేశారన్నారు. ప్రతీ ఇంట్లో ఉండే సమస్యలే వారి కుటుంబంలో కూడా ఉన్నాయన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికి ఉన్నప్పుడే షర్మిలకు అందాల్సిన ఆస్తులను జగన్‌రెడ్డి కన్నా ఒక తులం ఎక్కువే ఇచ్చి ఉంటారన్నారు. భాగ పరిష్కారాలు అయిన తర్వాత జగన్‌రెడ్డిపై షర్మిల ఈర్ష్యపడి ఇవాళ బహిరంగంగా ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా చౌకబారు విమర్శలు మానుకోవాలన్నారు.

వీరజవాన్ కుటుంబానికి బాసటగా నిలవాలి


మాట్లాడుతున్న విశ్వనాథ్

కడప (మారుతీనగర్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):చత్తీస్‌ఘడ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలో మావోయిస్టుల మందుపాతరకు బలైన బ్రహ్మంగారి మఠం మండలం పాపిరెడ్డిపల్లె దళితవాడకు చెందిన వీరజవాన్ కె.రాజేష్ కుటుంబానికి ప్రభుత్వాలు బాసటగా నిలవాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ డిమాండ్ చేశారు. రా జేష్‌కు భార్య, ముగ్గురు చిన్న పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారన్నా రు. కాగా దేశ సేవలో తరించే సైనికుడు చనిపోతే చివరిచూపు చూడలేని దౌర్భాగ్య స్థితిలో ఇక్కడి అధికారులు ఉండటం బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి కేంద్రం నుంచి రావాల్సిన వా టితో పాటు రాజేష్ భార్య స్వాతికి ఉద్యోగావకాశం కల్పించాలని, ఎక్స్‌గ్రేషియాగా రూ.కోటి, అలాగే ఐదు ఎకరాల సాగుభూమి, ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వమే చూడాలన్నారు.

గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కడప మారుతీనగర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని ఎస్‌పీవీఈ వ్యవస్థాపకుడు విజయరామ్ తెలిపారు. ఒక ఎకరం పొలంలో సుమారు రూ.3 లక్షల ఆదాయం వచ్చే మార్గం ఉందన్నారు. శనివారం హోమియో పతి వైద్యుడు వెంకటరావు ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత సుభాష్ పాలేకర్ వ్యవసాయాన్ని ప్రచారం చేసే క్రమంలో ఫిబ్రవరి 15నుంచి 24 వరకు హైదరాబాద్‌లో సుమారు 10 వేల మంది యువ రైతులకు ఆహ్వానం పలుకుతూ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కడప క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బంది, ఉద్యోగుల పిల్లలకు శనివారం పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో 'పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు ఉద్యోగుల పిల్లలకు 'సైబర్ నేరాల నిరోధంలో యువత పాత్ర' అనే అంశంపై పోటీలు నిర్వహించారు.

ఏవీఎస్ రాజుకు నట కళాతపస్వి పురస్కారం

కడప నాగరాజుపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం భాగ్యరత్న ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రంగస్థల నటుడిగా, లఘు చిత్ర దర్శకుడిగా ప్రసిద్ధుడైన ఏవీఎస్ రాజుకు నటకళాతపస్వి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి గానుగపెంట మనోజ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 27న కడప పెన్షనర్స్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ వివరించారు.

సంక్షిప్తం

రోడ్డు పనులకు సర్వే

కమలాపురం రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాత స్టేట్ బ్యాంకు నుంచి సీఎస్‌ఎస్ఆర్ డిగ్రీ కళాశాల మీదుగా పాలిటెక్నిక్ కళాశాల, వాటర్ ట్యాంకు వరకు గల రోడ్డు పనులకు శనివారం సర్వే చేపట్టారు. ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి సచివాలయం అధికారులకు తెలపడంతో వారు రోడ్డు సర్వే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సీఎస్‌ఎస్ఆర్ డిగ్రీ కళాశాల చైర్మన్ సీవీ రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామ సభల ద్వారా సమస్యలు పరిష్కరించుకోండి

చెన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు రీసర్వే గ్రామసభలో సమస్యలు తెలిపి వాటిని పరిష్కరించుకోవాలని మండల సర్వేయరు సోమశేఖర్ అన్నారు. రాచిన్నాయపల్లెలో శనివారం జరిగిన గ్రామసభలో సర్వేయరు మాట్లాడుతూ ప్రతి సమస్యకు గ్రామసభ పరిష్కారమన్నారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దారు సరస్వతి తెలిపారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

కడప(కలెక్టరేట్), అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో విద్యుత్ చా ర్జీలు పెంచడం తగదని కాంగ్రెస్ జిల్లా అ ధ్యక్షురాలు విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో విచ్చలవిడిగా విద్యుత్ చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచారన్నారు. కూటమి ప్ర భుత్వంలో అయినా విద్యుత్ భారాన్ని తగ్గించాలని ఆమె డిమాండ్ చేశారు

ఎస్టీలకు న్యాయం చేయాలి

సీకేదిన్నె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజమైన ఎస్టీలకు న్యాయం చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం కడప జిల్లా శాఖ అధ్యక్షుడు పి.వి.రమణ, మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామసిద్ధయ్య కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న బీఎల్ఎంలకు పదోన్నతులు ఇచ్చేటప్పుడు రిజర్వేషన్ పాటించాలని, కౌన్సిల్‌కంటే ముందు రోస్టర్ తయారు చేసి ఒక రోజు ముందుగానే ప్రకటించాలన్నారు.

నేడు పథ సంచలన్ ఆహ్వానం

వీరపునాయునిపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం 99 సంవత్సరాలు పూర్తిచేసుకొని శత వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అనంతపూర్ విభాగ్‌లోని అన్ని కండనగర కేంద్రాల్లో పథ సంచలన్ ఆహ్వానంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల కలోపు స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలకు కండ కార్యవాహ భవదీయ రఘునాథరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఓబులేస్, గణేష్‌లు తెలిపారు. ముఖ్య అతిథిగా సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత వెంకటసుబ్బానాయుడు, తిరుపతి సహ ప్రాంత కళాశాల విద్యార్థి ప్రముఖ అశోక్ హాజరుకానున్నారన్నారు.

దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు

పులివెందుల టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి):పులివెందులలోని మార్కెట్‌యార్డులో ఉన్న రైతుబజారులో దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చని రైతుబజారు ఎస్టేట్ అధికారిణి బి.రుచిత తెలిపారు. శనివారం మార్కెట్ యార్డులోని రైతుబజారులో ఆమె మాట్లాడుతూ రైతు బజారులో 22 స్టాల్స్ 13 దుకాణగదులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు 15 రోజుల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

ఆయుర్వేదంతో వ్యాధులకు చెక్

చెన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేదంతో అన్ని వ్యాధులకు చెక్ పెట్టవచ్చని చెన్నూరు ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవికుమార్ అన్నారు. 9వ ఆయుర్వేదిక్ దినోత్సవాల సందర్భంగా కొక్కిరాయపల్లెలో ఆయుర్వేద మందులతో వ్యాధులను నయం చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి మృతి

వల్లూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోటూరు గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి శనివారం మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏదైనా అవసరం ఉంటే సంప్రదించాలని కోరారు.

కేఎస్ఆర్ఎం కళాశాలకు న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్


కేఎస్ఆర్ఎం కళాశాలకు న్యాక్ ఎ ప్లస్‌గ్రేడ్ రావడం పట్ల సంబరాలు జరుపుకుంటున్న కళాశాల యాజమాన్యం

సీకేదిన్నె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఎ ప్లస్‌గ్రేడ్ రావడం కళాశాల విద్యాప్రమాణాలు, పరిశోధన, శిక్షణలో చూపిన అంకిత భావానికి గుర్తింపు అని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం న్యాక్ ఎ ప్లస్ గ్రేడ్ రావడంపట్ల విద్యాసంస్థల్లో ఆనందోత్సాహాల మధ్య విజయోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిలభారత విద్యాప్రమాణాల మండలి వారు కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలకు ఎ ప్లస్ గ్రేడ్ ఇచ్చారని, ఇది 2024 అక్టోబరు నుంచి 2029 అక్టోబరు వరకు అమలులో ఉంటుందన్నారు.ఈ విజయానికి కళాశాల అధినేతలు డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, వైస్ చైర్మన్ మదన్ మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ న్యాక్ ఎ ప్లస్‌గ్రేడ్ రావడం పట్ల కేఎస్ఆర్ఎం కళాశాల కీర్తి ఉన్నత స్థాయికి చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ అండ్ ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎన్. ప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

టపాసుల దుకాణదారులు నిబంధనలు పాటించాలి : ఆర్డీవో

జమ్మలమడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజన్ పరిధిలో టపాసుల దుకాణాలవారు నిబంధనలు పాటించాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ సూచించారు. శనివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో డివిజన్ పరిధిలోని అధికారులకు, క్రాకర్స్ (టపాసులకు సంబందించిన) ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ దుకాణానికి దుకాణానికి మధ్య నిబంధనలు అధికారులు ఇచ్చిన సూచనల మేరకు యజమానులు నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు.

ఘనంగా గుణవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



గుణవంత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

ముద్దనూరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి):ముద్దనూరులోని మండల బీజేపీ నాయకుడు మధుసూదనరెడ్డి స్వగృహం వద్ద ఆయన కుమారుడు బీజేపీ యువనాయకుడు గుణవంత్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు శనివారం బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేయగా పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.తహసీల్దారు కార్యాలయానికి రూ.80వేలు విలువచేసే రెండు కంప్యూటర్లు,ప్రింటర్లు తహసీల్దారు వరదకిశోర్ చేతుల మీదుగా వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

బద్వేలు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల నరసింహారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్, ఫార్మశీని పరిశీలింకచారు. సదరు ఆరోగ్యకేంద్రంలో తగినంత మంది సిబ్బందితో పాటు అన్ని పరీక్షలు అధునాతన పరికరాల ద్వారా నిర్వహిస్తామని ,ఒక వేళ టెస్టులలో ఏవైనా తేడాలు ఉంటే స్పెషలిస్ట్ డాక్టర్లు అవసరమైతే టెలిమెడిషన్ సౌకర్యం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ శరత్ చంద్ర, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ ఎప్పుడు..?




- అధికారుల నిర్లక్ష్యం
- భయాందోళన కల్గిస్తున్న మడూరు పెద్ద కాలువ

ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం అభివృద్ధిలో భాగంగా 9వ వార్డు ఓబుళరెడ్డి కల్యాణ మండపం నుంచి చాచా నెహ్రూ స్కూల్ వరకు నిర్మించిన సిమెంటు రోడ్డును రూ.27.47 లక్షల మున్సిపల్ 2019-20 సాధారణ నిధుల ద్వారా నిర్మించారు. ఈ రోడ్డు ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండడంతో పాటు రోడ్డుకు ఆనుకుని మడూరు పెద్ద కాలువ ఎటువంటి రక్షణ గోడ లేక అంతే ప్రమాదకరంగా ఉందని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు నాయకులు, అధికారులకు రక్షణ గోడ నిర్మించాలని మొరపెట్టుకున్నా కనికరించలేదన్నారు. రక్షణ గోడ లేని కారణంగా అనేక మంది రాకపోకల సమయంలో కాలువలో పడుతున్నారు. రక్షణ గోడ లేని కారణంగా గతంలో ఈ కాలువలో ప్రమాదవశాత్తు ఒకరు పడి మృతిచెందగా ఈ మధ్యకాలంలో మరొకరు బలికావడం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలో ఆవులు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయని వాటిని బయటకు తీయడానికి స్థానికులు పడే అవస్థలు వర్ణనాతీతం అనివాపోతున్నారు. ప్రమాదాలు జరిగినతర్వాత అధికారులు రావడం కన్నా ప్రమాదాలు జరుగకముందే నివారించడం మిన్న అని అంటున్నారు.

ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు వెంబడి ఉన్న మడూరు పెద్దకాలువకు రక్షణ లేక రక్షణ కవచం నిర్మించి ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● రక్షణ గోడ నిర్మించండి



నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును ఆనుకుని ఉన్న మడూరు కాలువకు రక్షణ గోడ లేని కారణంగా తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలను నివారించాలి.

విజయ్‌కుమార్, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు

● కాలువలో పడి ప్రాణాలు కోల్పోయారు



కాలువకు రక్షణ గోడ లేని కారణంగా రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచా రులు, మూగజీవాలు కాలువలో పడి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు రక్షణ కంచె నిర్మించే కార్యక్రమం చేపట్టాలి.

రాములమ్మ, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు.

నేడు తుమ్మెద పదాలు పుస్తకావిష్కరణ సభ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రచయిత కాశీవరపు వెంకటసుబ్బయ్య రచించిన తుమ్మెద పదాలు పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఉదయం 10.30 గంటలకు పుట్టపర్తి నారాయణాచార్యుల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న చైతన్య సాహిత్య కళావేదిక కార్యదర్శి కాశీవరపు రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి సభాధ్యక్షుడుగా వ్యవహరిస్తారని, పద్యకవి ఏసీ దస్తగిరి, అనువాద రచయిత కొమ్మిశెట్టి మోహన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువులబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. సాహితీవేత్తలు, సాహితీ అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని వల్లెరవారి పల్లె లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం వేకువజామునే ప్రత్యేక అభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మాట్లాడుతూ శుక్రవారం అమావాస్య స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకం నిర్వహిస్తున్నామని, అలాగే కోటి దీపోత్సవ కార్యక్రమంఏర్పాటు చేస్తున్నా మన్నారు మధ్యాహ్నం ప్రొద్దుటూరుకుచెందిన గోపవరం వెంకట్రామయ్య అన్నదానం చేశారు.

29, 30న డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 29, 30తేదీల్లో నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలియజేశారు. సమావేశ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి

జమ్మలమడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు డివిజన్‌కేంద్రంలో విద్యార్థులకోసం ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు గురుమూర్తి తెలిపారు. ఈ మేరకు ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం అందించి ఆయన మాట్లాడారు.

విద్యార్థుల చేతుల్లోనే ఉత్తమ సమాజం



వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సమాజం విద్యార్థుల చేతుల్లోనే ఉందని మానవత కేంద్రకమిటీ సభ్యులు పేర్కొన్నారు. విద్యార్థులు-నైతికవిలువలు, విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై చిలమకూరు జడ్పీహైస్కూల్, ఇంటర్ విద్యార్థులకు అవేర్‌నెస్ కార్యక్రమాన్ని మానవత యూనిట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. వ్యాసరచనల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు గురు మహేశ్వరి, ఎస్.ఆఫ్రిన్, ఫరిద, వై.వాసవి, సుప్రియ, జి.అనితకు షీల్డ్, నగదు, సర్టిఫికెట్స్‌ను పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో మానవత ఎర్రగుంట్ల చైర్మన్ డి.రఘురామిరెడ్డి, అధ్యక్షులు డాక్టర్ ఎస్.రామాంజనేయరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్వీరమణారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సావిత్రి, కేంద్రకమిటీ సభ్యులు రాటాల గోపి, అవటాల రామాంజనే యరెడ్డి, ఎంవీ కృష్ణారావు

ఫారం పాండ్స్ రైతులకు ఎంతో మేలు :జేడీఏ



పత్తిపంటను పరిశీలిస్తున్న జేడీఏ నాగేశ్వర్‌రావు

కాశినాయన అక్టోబరు (ఆంధ్రజ్యోతి)26: రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్స్ ఏర్పాటు చేసుకుంటే ఆరుతడి పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతాయని జిల్లా వ్యవసాయ శాఖ జేడీఏ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కోడిగుడ్లపాడు రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం గ్రామంలో సాగుచేసిన పత్తిపంటను పరిశీలించి సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో పోరుమామిళ్ళ ఏడీఏ మురళీధర్‌రెడ్డి,ఏవో జయలక్ష్మీరైతుభరోసా కేంద్రం సిబ్బంది శ్రీను, మధు పలువురు రైతులు పాల్గొన్నారు.

క్షేత్రపర్యటనతో విద్యార్థులకు విజ్ఞాన వికాసం



క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులు

పోరుమామిళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయి పర్యటనతో విద్యార్థులకు విజ్ఞాన వికాసం లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ నగిలి ప్రకాశరావు తెలిపారు. శనివారం వృక్ష శాస్త్రవిభాగాధిపతి శ్రీధర్‌మూఇర్తి ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులు కడపలోని వైవీయూలో క్షేత్ర పరిశీలనకు వెల్లారు. ఈ సందర్భంగా వృక్ష శాస్త్ర విభాగాధిపతి శ్రీధర్‌మూర్తి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోవిద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దవచ్చన్నారు

ప్రజా సమస్యలపై స్పందించాలి : ఎంపీడీవో

ముద్దనూరు, అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని అధికారులకు ఎంపీడీవో అలవలపాటి ముకుందారెడ్డి సూచించారు.స్థానిక ఎంపీడీవో సభాభవనంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంతో ప్రాధాన్యత కల్గిన సర్వసభ్యసమావేశానికి ఎంపీపీ కుడుముల ప్రదీప్‌రెడ్డి గైర్హాజరయ్యారు. సమావేశం భాగంగా ఎంపీడీవో మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, వైద్యం,వ్యవసాయం పై తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరనాయక్, ,ఎంపీటీసీ లక్ష్మీకాంతమ్మ, కార్యదర్శులు, సర్పంచ్‌లు, మండల అధికారులు పాల్గొన్నారు.

'షర్మిలపై విమర్శలు చేయడం దారుణం'

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): వైఎస్ కుటుంబంలో జరుగుతున్న ఆస్తుల వివాదంలో తలదూర్చి వైఎస్.షర్మిలపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు విమర్శలు చేయడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాచమల్లు గతంలో షర్మిలను ఒకసారి వైఎస్ బిడ్డకాదని, మరోసారి విజయమ్మ కుమార్తె కాదని మాట్లాడారని దీనిపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. వివేకానందరెడ్డి హత్యకేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి పాత్ర గురించి కుటుంబంలో చెప్పినా, వ్యక్తిగతంగా చెప్పినా జగన్ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జిలానీబాష పాల్గొన్నారు.

మెప్మాబజార్ ప్రారంభం

ఎర్రగుంట్ల, అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): ఎర్రగుంట్లలో మెప్మా బజార్‌ను కమిషనర్ శేషఫణి శనివారం ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులు, వారు వ్యాపారం నిర్వహిస్తున్న వస్తువలు ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో పెట్టి విక్రయిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భూఆక్రమణలపై కఠిన చర్యలు

బద్వేలు తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు



ముఖాముఖి

బద్వేలుటౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మండల పరిధిలో నెలకొన్న భూ సమస్యల పైనకానీ, భూ ఆక్రమణలపైన కఠిన చర్యలు చేపడతాం. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిం చేందుకు ప్రయత్నిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతాం. భూసమస్యలపైకానీ, ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ ఇంటిపట్టా సమస్యలపై బాధితులు ఎవరైనా రెవెన్యూ కార్యాలయానికి వచ్చి అర్జీల రూపంలో ఫిర్యాదు ఇస్తే, ఇరువర్గాలను రెవెన్యూ కోర్టులో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసేందుకు అందు బాటులో ఉంటాం. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కేసులు నమోదుచేసి ప్రభుత్వభూములను స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాము. ప్రజా సమస్యలను పరిష్కరమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తామంటున్న తహసీల్దర్ ఉదయభాస్కరరాజుతో **ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ..**

ప్రశ్న : బద్వేలు మండల పరిధిలో భూకబ్జాలపై చర్యలు ఏ విధంగా చేపడుతారు. ?

జవాబు : మండల పరిధిలో ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లు మా దృష్టికి వస్తే వెంటనే స్పందించి అక్రమ కట్టడాలను నిలిపివేసి నోటీసులుజారీచేసి రెవెన్యూ కోర్టులో విచారణ జరుపుతాం. రికార్డులను పరిశీలించి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : మండల పరిధిలో ఆక్రమణలకు గురైన చెరువులను, కుంటలను గుర్తించారా ?

జవాబు : మండల పరిధిలో బయనపల్లె, పుట్టాయపల్లె చెరువు, నాగులచెరువు కొంత మేర ఆక్రమణలకు గురైందని, ఆ చెరువుల్లో కమ్యూనిస్టులు గుడిసెలు వేశారని, వాటిని వెంటనే తొలగించాం, ఆక్రమించినవారిపై 21 మందిపైన కేసులు నమోదు చేశాం. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకొని కేసులను నమోదు చేస్తాం.

ప్రశ్న: రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టారా ?

జవాబు : పేదలకు ఇచ్చే రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా డీలర్లనుంచే నేరుగా ప్రజలకు అందే విధంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిరంతరం నిఘా పెట్టాం. ప్రజలు కూడా అక్రమ రేషన్ రవాణావిషయం తెలిస్తే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలి. అక్రమంగా తరలిస్తున్న బియ్యంతో పాటు వాహనాలను సీజ్‌చేసి వారిపై కేసులను నమోదు చేస్తాం. రేషన్ డీలర్లు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే డీలర్‌షిప్‌లను రద్దుచేస్తాం. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

ప్రశ్న: రెవెన్యూ పరంగా ఎటువంటి చర్యలు తీసుకుంటారు.?

జవాబు : రైతులకు ఎదురయ్యే సమస్యలను గ్రామస్థాయిలో ఆయా రెవెన్యూ అధికారుల ద్వారా సమాచారం సేకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

ప్రశ్న: రీసర్వేలో సమస్యలు ఉంటే ఎలా పరిష్కరించుకోవాలి ?

జవాబు : రీసర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపడుతున్నామని, రీసర్వేలో తారుమారు, రిజిస్టర్‌లో లోపా లు, భూముల అవకతవకలు, ఆన్‌లైన్ ట్యాంపరింగ్, సరిహద్దు వివాదాలు, ఏ ఇతర భూ సమస్యలు ఉన్నప్పటికీ రెవెన్యూసదస్సుల ద్వారా పరిష్కారం లభిస్తుంది.

అట్టహాసంగా టీడీపీ సభ్యత్వ నమోదు



టీడీపీ సభ్యత్వ నమోదులో ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. శనివారం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాతకుంట శివారెడ్డి, బాలు, ఖాదర్, అంబవరం రామయ్య, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, పొన్నతోట మల్లి, తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి నమోదు కార్యక్రమం ప్రారంభించారు. పేర్లు నమోదు చేసుకున్న వ్యక్తులకు భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు వారికి రూ.5లక్షలు ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. అలాగే ఆరోగ్య, విద్యాపరంగా లబ్ధి చేకూరుతుందన్నారు. సహజంగా మరణించినా కూడా రూ.2లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మండల మాజీ అధ్యక్షుడు ఎం.మహేశ్వర్‌రెడ్డి, నాయ కులు జయక్రిష్ణారెడ్డి, సులోచనమ్మ, నరసింహారెడ్డి, కుప్ప య్య, అక్బర్ సాహెబ్, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, నరసింహు లు, యల్లారెడ్డి, బొబ్బిలయ్య, వీరస్వామి, సిద్దయ్య, అల్లం వెంకటసుబ్బయ్య, గంగిరెడ్డి, గురుప్రసాద్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బద్వేలుటౌన్..: తెలుగు దేశంపార్టీలోనే భవిష్యత్తు ఉంటుం దని ప్రతి ఒక్కరూ సభ్యత్వనమోదు చేయించుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్నవారికి రూ.5లక్షలు ప్రమాదబీమా వర్తిస్తుందని, కార్యకర్తల కుటుంబాలకు, వారి పిల్లల చదువుకు ఆర్థికసాయం తదితర విషయాలకు పార్టీ అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మిత్తికా యల రమణ, సుధాకర్‌రెడ్డి, నాగభూషణం, సీనియర్ న్యాయవాది ప్రసాద్, నరసింహనాయుడు, బిగ్‌బాస్ మహేశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య, మల్లికార్జునరెడ్డి, జిలానీబాష, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్..: టీడీపీ సభ్యత్వ నమోదును ప్రతి కార్యకర్త చేయించుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ సభ్యత్వ నమోదు జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, మారుతి,ఎరికలయ్య తదితరులు పాల్గొన్నారు.